చిరస్మరణీయులు పొట్టిశ్రీరాములు

- వీఎస్‌యూ వైస్ చాన్సలర్ సుందరవల్లి
- ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

వెంకటాచలం : ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు తెలుగు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ చిరస్మరణీయులు అని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పొట్టిశ్రీరాములు చిత్రపటానికి వీసీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మ గాంధీ వీర విధేయుడు అయిన పొట్టిశ్రీరాములు రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. తన తనువు కంటే కన్న భూమి గొప్పదని భావించి ప్రాణాలను పణంగా పెట్టి ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పునాదులు వేశారని కొనియాడారు. నెల్లూరు జిల్లా వారసుడైన పొట్టిశ్రీరాములును గౌరవించుకోవడం, ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని తెలియజేశారు. వీఎస్‌యూలో ఆవిష్కరించిన పొట్టిశ్రీరాములు విగ్రహం భావితరాలకు ఆయన రాష్ట్రం కోసం చేసిన త్యాగాన్ని గుర్తు చేస్తుందన్నారు. వీఎస్‌యూలో ఆవిష్కరించిన పొట్టిశ్రీరాములు విగ్రహానికి రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉదయ్ శంకర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కె.సునీత, విద్యా ప్రభాకర్, సుజా ఎస్ నాయర్, టి.వీరారెడ్డి, అర్.ప్రభాకర్, ఎం.హనుమారెడ్డి, వెంకట్రాయులు, హుస్సేనయ్య, కన్యారావు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : వీఎస్‌యూలో ఆవిష్కరించిన పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో..

పొదలకూరు : పట్టణంలోని శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. పొట్టిశ్రీరాములు త్యాగఫలంతోనే ఆంధ్ర రాష్ట్రం అవతరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆదూరు వెంకటసుబ్బయ్య, రాచపూటి రామలింగయ్య, ఎ.చెంచయ్య, తన్నీరు సురేష్, తన్నీరు సుందరరాజా తదితరులు పాల్గొన్నారు.

గొలగమూడిలో..

వెంకటాచలం : మండలంలోని గొలగమూడి వద్ద నున్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల పాఠశాలలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపల్ డి.కొండల్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి

కోవూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం అర్పించిన పొట్టిశ్రీరాములును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీమరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముజీబ్, టైపిస్ట్ హుమయున్, సిబ్బంది సుబ్బారావు, డ్వామా ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద కేక్‌కట్ చేస్తున్న ఆర్యవైశ్య నేతలు



వెంకటాచలం : గొలగమూడిలోని జ్యోతిరావు పూలే బీసీ బాలికల పాఠశాలలో..



కోవూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో..

క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం



మాట్లాడుతున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మేయర్ పొట్లూరి స్రవంతి ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిపై కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రూరల్ పరిధిలో ఇప్పటి వరకు రూ.13.22 కోట్లతో 158 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.3.34 కోట్లతో పనులు జరుగుతున్నాయని వివరించారు. రూ.15.98 కోట్లతో చేపట్టనున్న 191 పనులు టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): విశాఖపట్నంలోని ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అన్ని సంఘాలు, నేతలు ఉద్యమించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఆర్‌ఎస్‌యూ తొమ్మిదో జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8న నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నేతలు మోహన్, శ్రీనాథ్, సాయితేజ, కార్తీక్, పవన్, ఆకాశ్, సాత్విక్, ప్రణయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



మందులను అందజేస్తున్న గౌరి

నెల్లూరు(బారకాసు): ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. 21 / 3 సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. సాధారణ వ్యాధులతో పాటు బీపీ, షుగర్, నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేస్తున్నారని వివరించారు. సీడీపీఓ అన్నపూర్ణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, కార్పొరేటర్ మూలె విజయభాస్కర్‌రెడ్డి, నేతలు పెంచలనర్సారెడ్డి, రాజారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, సాయి, బుజ్జన్న, మంజు, కృష్ణ మాల్యాద్రి, రజిని, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సేవల్లోనూ ముందుండాలి



కార్యవర్గాన్ని అభినందిస్తున్న నేతాజీ సుబ్బారెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సేవల్లోనూ వాకర్స్ క్లబ్ ముందుండాలని వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభించిన వీఆర్సీ గ్రౌండ్స్ వాకర్స్ లాఫింగ్ క్లబ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారాన్ని వీఆర్సీ మైదానంలో బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి, కార్యదర్శిగా రియాజ్ అహ్మద్, గౌరవాధ్యక్షుడిగా అడ్వొకేట్ సన్నేసాహెబ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా విజయకుమార్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ గవర్నర్ వెంకటాద్రిరెడ్డి, గవర్నర్ ఎలక్ట్ శ్రీనివాసులురెడ్డి, రఘురామిరెడ్డి, బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది వెంకురెడ్డి ఇటీవల మృతి చెందడంతో నగరంలోని జిల్లా కోర్టు హాల్లో సంతాప సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని అధ్యక్షత వహించారు. సంతాప సూచకంగా కోర్టు కార్యక్రమాలను గంట ఆలస్యంగా ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం



పొదలకూరు : పట్టణంలోని ఒకటో వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న వినికిడి సమస్య ఉన్న బాలుడు ఎస్‌కే హర్షద్‌కు కాకాణి గోవర్ధన్‌రెడ్డి యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఒకటో వార్డు సభ్యుడు ఎస్‌కే అంజాద్ బుధవారం ఆర్థిక సాయాన్ని అందించారు. బాలుడికి ప్రొటీన్ పౌడర్‌తో పాటు, రూ.2 వేల నగదును అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ వెంకటకుమారి, ఆయా ఆదిలక్ష్మి, బాలుడి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థిని



విద్యార్థిని శ్రావణి

వెంకటాచలం : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని గొలగమూడిలో ఉన్న ప్రభుత్వ ఆశ్రమ గిరిజన పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని బండి శ్రావణి ఎంపికైంది. చిత్తూరు జిల్లా బంగారుపాళెంలో ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగనున్న స్కూల్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్) అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రావణి పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల పీడీ షేక్.షబిక అభినందించారు.

శాస్త్రీయ వ్యవసాయంతో అధిక లాభాలు

మనుబోలు : శాస్త్రీయ అవగాహనతో వ్యవసాయం చేస్తే రైతులు అధిక దిగుబడులతో పాటు లాభాలు గడించవచ్చని నిచినో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్(సీఓఓ) ధరణిశెట్టి తెలిపారు. మనుబోలులోని రవి ఫర్టిలైజర్స్‌ను బుధవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు ఇష్టారాజ్యంగా పురుగు మందులు, ఎరువులు వాడుతున్నారని, వ్యవసాయ నిపుణుల సలహాల మేరకు అవసరమైన సమయంలో సరైన మోతాదులోనే ఎరువులు, పురుగు మందులను వినియోగించాలన్నారు. అనంతరం సీఓఓను ఫర్టిలైజర్స్ యజమాని దామిశెట్టి రంగారావు సన్మానించారు. వారి వెంట నిచినో ఆర్‌ఎం కృష్ణారెడ్డి, టీమ్ మేనేజర్ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.



రైతులతో సీఓఓ ధరణిశెట్టి

బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా కె.లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు ముందు ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా విష్ణువర్ధన్ ఉండేవారు. కాగా కొత్త ప్రిన్సిపల్‌కు అధ్యాపకులు, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు. కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపొందించి గుర్తింపు తీసుకొస్తానని తెలిపారు.

ప్రతిభావంతులకు అభినందన

ఇందుకూరుపేట : రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పతకాలు సాధించిన మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, వ్యాయామ ఉపాధ్యాయుడు కోటపురి ఆరోరా బుధవారం అభినందించారు. గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లాలో జరిగిన పోటీల్లో విద్యార్థులు కె.మోక్షశ్రీ, కె.గోపిక పూర్ణిమ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు హెచ్‌ఎం చెప్పారు. ఈ నేపథ్యంలో పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పాఠశాల ఆవరణలో అభినందించినట్లు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

ధర్మప్రచార వారోత్సవాలకు శ్రీకారం



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న ధర్మప్రచార వారోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. కొండ దిగువన ఉన్న దేవరపాళెంలో గల పోలేరమ్మ ఆలయం వద్ద సుదర్శన హోమం, కుంకుమార్చన, కల్యాణోత్సవం, కోలాట ప్రదర్శనను జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలు ఐక్యంగా ఉండాలి

కోవూరు : జిల్లాలో చేనేత కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భువనగిరి మల్లికార్జున, నందం శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో వారు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత వృత్తి పరిరక్షణ, గిట్టుబాటు కూలి తదితర విషయాలను ప్రభుత్వ పెద్దలతో చర్చించి చేనేత రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దీనికోసం నేత కార్మికులందరూ సమష్టిగా ముందుకు సాగాలన్నారు. చేనేత సమస్యలపై 13 అంశాలతో ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. అనంతరం మల్లికార్జున, నందం శ్రీనివాసులును సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట సురేష్, జాతీయ కమిటీ సభ్యుడు కేవీ శేషయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండపల్లి రాజా, వి.వేణుగోపాల్, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చేనేత నాయకులకు సన్మానం

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తల్లి వేమిరెడ్డి శ్యామలమ్మ పదో వర్ధంతిని బుధవారం నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నదానంతో పాటు సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. చిల్డ్రన్స్ పార్క్, సాయిబాబా మందిరం, గీతామయి వృద్ధాశ్రమం, ప్రగతి చారిటీస్, జనహిత వాత్సల్య ఆశ్రమాల్లో అన్నదానం చేశారు. తమ సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి దుస్తులను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులు పంపిణీ చేశారు.

జగదేవిపేట వైద్యాధికారిగా కిశోర్‌కుమార్

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ సి.కిశోర్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి డాక్టర్ సుచిత్ర ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీకి హాజరైన కిశోర్‌కుమార్‌కు వైద్యారోగ్యశాఖ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఇక్కడ వైద్యాధికారిగా మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందిన డాక్టర్ సుచిత్రను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, హెచ్‌ఈ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

పూర్వ ఎంపీడీఓకు సన్మానం

తోటపల్లిగూడూరు : గత ఏడేళ్లగా తోటపల్లిగూడూరు ఎంపీడీఓగా పనిచేసిన హేమలత ఇటీవల పదోన్నతిపై నుడా అకౌంట్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ క్రమంలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆమెకు బుధవారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా హేమలతను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

అనంతరం ఎంపీపీ స్వర్ణలత మాట్లాడుతూ ఎంపీడీఓగా హేమలత మండలాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ప్రస్తుత ఎంపీడీఓ ప్రత్యూష, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, మండలాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



హేమలతను సన్మానిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఏడో రోజూ హమాలీల నిరసన

కోవూరు : ఇనమడుగు సెంటర్‌లో హమాలి కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళన బుధవారం ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ హమాలీల న్యాయమైన సమస్యను యాజమాన్యం పరిష్కరించాలని, దీనిపై కాలయాపన చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకోకుండా అన్ని గోదాముల్లో ఇస్తున్న కూలీనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కార్మిక నేతలు

వినాయక స్వామికి ప్రత్యేక పూజలు

కోవూరు : మండల కేంద్రంలోని వినాయక స్వామి దేవస్థానం ప్రాంగణంలో గణనాథుని విగ్రహానికి అర్చకుడు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వీరాంజనేయస్వామి క్యాటరింగ్ అధినేతలు వ్యవహరించారు.



పూజలు చేస్తున్న అర్చకులు

రబీపై చిగురించిన ఆశలు



కొడవలూరు : తొలి పంట(రబీ)పై రైతుల్లో ఆశలు చిగురించాయి. సోమశిల జలాశయంలో 30 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వ ఉండడం, వర్షాలు రాకపోవడంతో రబీపై రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతులు నార్లు పోసుకునేందుకు కూడా జాప్యం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే గత సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో వర్షాలు కురుస్తాయన్న ఆశలు రైతుల్లో బలపడ్డాయి. రబీ పంటపై ఆశలు రేకెత్తాయి. ఈ వర్షాలు మరో రెండ్రోలు కొనసాగితే రైతులంతా నార్లు పోసుకునేందుకు సిద్ధం కానున్నారు. జిల్లాలో నవంబర్ మొదటి వారంలో వర్షాలు పడడం ఆనవాయితీ. మరో రెండ్రోజులు ముందుగానే వర్షాలు ఆరంభమయ్యాయి. ఆశాజనకంగా వర్షాలు కురుస్తాయన్న ధీమా రైతుల్లో బలపడింది. రైతులంతా తొలి పంటపైనే ఆశలు పెట్టుకుంటారు. ఖరీఫ్‌లో ధాన్యం ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు మంచి ధరలకు ధాన్యం విక్రయించుకున్నారు. రెట్టింపు ఉత్సాహంతో రబీపై ఆశలు పెంచుకున్నారు. అయితే వర్షాలు రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు వర్షాలు ఆరంభం కావడంతో తొలి పంటకు సిద్ధమవుతున్నారు.

పకడ్బందీగా ఈవీఎంల పరిశీలన

నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంల పరిశీలనను పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎంల గోదాము వద్ద నిర్వహిస్తున్న పరిశీలన ప్రక్రియను బుధవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిని ఈవీఎంల పరిశీలకులు తప్పక పాటించాలని సూచించారు. నియోజకవర్గాల ఈవీఎంలను సైతం పక్కాగా తనిఖీ చేయాలన్నారు. ఈవీఎంల పర్యవేక్షణాధికారి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ చిన్న ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు రూరల్: జిల్లాలోని ఎస్సీల సమస్యలను పరిష్కరించాలని మాలమహానాడు నేతలు కోరారు. ఈ మేరకు గుంటూరు జిల్లాలోని వేమూరులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణా వెంకయ్య ఆధ్వర్యంలో పలువురు బుధవారం కలిశారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, నేతలు మోహన్‌కృష్ణ, శ్రీనివాసులు, దారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నాగార్జునను సత్కరిస్తున్న నేతలు